# పాత్రలకే ప్రాణం వస్తే....?

సి.జయాబాలకృష్ణ



రైలు వేగంగా కదిలిపోతున్నది. కిటికీ ప్రక్క సీటులో కూర్చున్నాడు శ్రీరామ్. ముందుగానే రిజర్వు చేయించుకోవడంతో - ఆ సీటూ, బెర్త్ తనకే దొరికింది.

కంపార్ట్‌మెంటులో జనం కూడా ఎక్కువగా లేరు. ఉన్న కొద్ది మందీ కూడా - ఎవరి ప్రపంచం వారిది... ఎవరి ఆరాటం వారిది... ఎవరి ఆలోచనలు వారివి, ఎవరి బ్రతుకులు వారివి... ఎవరి గమ్యం వారిది.

నిజానికి శ్రీరామ్‌కి తొందరగానే ఉంది. ఆరాటంగానూ ఉంది - గమ్యానికి చేరుకోవాలనే . తొందర, ఆరాటం - ఇవేవీ రైలు వేగాన్ని పెంచలేకపోతున్నాయి... మనసులోని ఆలోచనల వేగాన్ని తప్ప -

"సృష్టిలోనూ - మానవ సృష్టిలోనూ మనసు కంటే వేగంగా పయనించేది ఈ భువి మీద లేదు..." అనిపించింది.


రైలు ముందుకు పోతూనే ఉన్నది.

సిగరెట్టు వెలిగించాడు. సిగరెట్టు పొగ గాలిలోకి తేలిపోయి, శూన్యంలోకి కలిసిపోతున్నది.

శ్రీరామ్‌కి ప్రయాణం చెయ్యడమంటే ఇష్టమే. అందులో రైలు ప్రయాణం...! తనకి ఇష్టమైన సీటు దొరికితే మరీ ఆనందం. ఆ ఆనందంలో... ఇప్పుడు తన ప్రయాణానికి కారణం... తను కలుసుకోబోయే మనిషీ... అన్నీ ఆనందంగానే ఉన్నాయి.

"కాఫీ... కాఫీ" కాఫీ అమ్ముతూ వచ్చాడు ఓ అబ్బాయి కంపార్ట్‌మెంటులోకి. ఓ కప్పు కాఫీ తీసుకున్నాడు.

ముందుకు దూసుకుపోయే రైలు వేగం పెరిగిపోతున్నది - చేరుకోవలసిన



గమ్యానికి దూరం తరిగిపోతున్నది.

వెనక్కి పోయే చెట్లూ, కొండలూ, కోనలూ... శ్రీరామ్ ఆలోచనలు కూడా వెనక్కి మళ్లినాయి.

కొన్నాళ్ల క్రిందట - తెలుగు పత్రికలో - తను చదివిన కథ గుర్తు వచ్చింది.

ఎంత మంచి కథ...! చక్కని ఇతివృత్తం-

ఎంత బాగా రాశారు రచయిత! -

అసలు ఆ కథ ఎంత గొప్పదో, ఆ రచయిత ఎంత గొప్పవాడో తనకి తెలియదు - కానీ - ఆ కథ తన కళ్లు తెరిపించింది. ఫలితంగా తను నిర్లక్ష్యం చేసి, చెయ్యి జార్చుకోబోయిన పెన్నిధి తనకి మిగిలింది. ఆ కథ తనకి ఆనందం ఇచ్చింది, తృప్తి నిచ్చింది.

అందుకని - తన దృష్టిలో ఆ కథ మంచి కథ - ఆ రచయిత మంచి రచయిత -

"డబ్బులు, సార్!" కాఫీ ఇచ్చిన అబ్బాయి వచ్చి అడిగాడు.

ఆలోచనల ప్రవాహాన్ని ఆపి, ఆ అబ్బాయికి డబ్బులు ఇచ్చి పంపేశాడు.

అంతరాయం కలిగి, తప్పుకున్న ఆలోచనలు మళ్లీ ముసురుకున్నాయి శ్రీరామ్‌ని...

సంచిలో నుంచి పత్రిక తీశాడు. మెదడు నిండా ముసురుతున్న ఆలోచనల ప్రభావం - శ్రీరామ్‌కి ఆ పత్రికలో ప్రచురించిన కథ మళ్లీ ఒకసారి చదవాలనిపించింది.

★ ★ ★ ★ ★

అది మే నెల.

ఆదిత్యుడు లోకం మీద అతివాడిగా, చురుకుగా విజృంభిస్తున్నాడు. విపరీతమైన ఎండ ప్రభావం లోకం మీద వేడిగా, బాధగా ఉంది.

ఎండ వేడికి - చెట్ల మీద పక్షులు కదలక, గువ్వల్లా - ఆకుల చాటున ఒదిగి ఉన్నాయి. రోడ్డు మీద జన సంచారం కూడా అంతగా లేదు.

స్కూలు మేష్టారు రామారావుకి శెలవు రోజులు. దాదాపు మధ్యాహ్నం

మూడు గంటల సమయం. ఏమీతోచక, సిగరెట్టు కాలుస్తూ - కిటికీలో నుంచి చూస్తూ నిలబడ్డాడు రామారావు.

మాడిపోయే ఎండ - ఎవరో వస్తున్నట్టుగా ఉంది - 'ఎవరా?' అని చూపు నిలిపాడు.

గోపాలంగా రింట్లో పని చేసే సత్తెమ్మ - వెనకాల ఇద్దరు చిన్న పిల్లలూ - వస్తున్నారు...


"బహుశ పనికి కాబోలు వెళుతున్నది..."

కష్టపడితేగాని - బ్రతుకు గడవదు సత్తెమ్మకి -

మండిపోయే ఎండ, ఎండ వేడికి త్వరగా అలిసిపోయే శరీరం, శ్రమపడలేని అశక్తత - శ్రమిస్తేగాని రోజు గడవని బ్రతుకు - సత్తెమ్మని యంత్రాన్ని చేశాయి.

సత్తెమ్మ మొగుడు తాగుబోతు - వాడు సంపాదించినా, అది వాడి తాగుడుకే సరిపోతుంది - సంసారం బాధ్యత సత్తెమ్మకి తప్పదు - తను కష్టపడి అయినా పిల్లల్ని వృద్ధిలోకి తీసుకురావాలనే సత్తెమ్మ ఆరాటం... తాగుబోతు మొగుడ్ని పిల్లల్ని చూసుకోవాల్సిన బాధ్యత - అందుకోసం సంపాదన తప్పదు - శ్రమ తప్పదు...

క్రింద కాళ్లూ, పైన తలా రెండూ మాడిపోతూనే ఉన్నాయి సత్తెమ్మకి, కొడుకులకి కూడా. నాలుగిళ్లల్లో పని చేస్తుంది. ఇప్పుడు మొదలుపెడితే కానీ, సాయంత్రానికి అందరిళ్లలోనూ పని పూర్తి కాదు...




"ఇంటికాడ ఉండండి కొడుకా అంటే వినరు కదా!" అనుకుంటూ నడుస్తున్నది.

క్రింద కాళ్లు మాడిపోతున్నాయి. ఎండకి కాళ్లు చురుక్కుమంటూ ఉంటే - గబగబా నడుస్తున్న తల్లితో నడవలేక... నడవలేక ... సన్నటి ఏడుపుతో, పేచీలతో వెనకాల నడుస్తున్నారు సత్తెమ్మ కొడుకులు... ఒకడికి ఏడేళ్లు ఉంటాయి... రెండో వాడికి బహుశ అయిదేళ్లు ఉంటాయి.

అక్కడే ఉన్న ఇసక దిబ్బ దగ్గరికి వచ్చింది సత్తెమ్మ. ఇసుక కుప్ప పక్కగా వెళ్లింది. ఆ ఇసుకలో ఏమిటో వెతుకుతున్నది.

తన గది కిటికీలో నుంచి చూస్తున్న రామారావుకి ఆశ్చర్యం వేసింది. 'ఇంత ఎండలో ఆ ఇసుకలో ఏమిటి వెతుకుతున్నది?' అనుకున్నాడు.

వెతుకుతూనే ఉన్నది సత్తెమ్మ.

'త్వరగా వెళ్లక, ఏమిటి వెతుకుతున్నది?' ఆశ్చర్యంతోబాటు, కుతూహలం హెచ్చింది రామారావుకి.

చూస్తూ నిలబడ్డాడు.

పిల్లల పేచీ, సన్నటి ఏడుపునీ కూడా వినిపించుకోవడంలేదు. కాళ్లు కాలిపోతున్నాయి, ఒళ్లు మాడిపోతున్నది. ఎండ వేడికి మాడి, ఇసుక చేతికి చురుకుగా తగులుతున్నా లెక్కచెయ్యడంలేదు.

"ఈడనే పెట్టినా" అనుకుంటూ వెతుకుతున్నది. అయిదు నిముషాల తరువాత - సత్తెమ్మ చేతికి దొరికినాయి ఓ పాత చెప్పుల జతే...!

"వీటి కోసమా అంతగా వెతికింది!" చూస్తూ నిలబడ్డ రామారావు నిట్టూర్చాడు - 'కొండని త్రవ్వి, ఎలుకని తీసినట్టు' సామెత గుర్తు వచ్చింది.

సత్తెమ్మ ఆనందంగా ఆ చెప్పుల్ని చేతిలోకి తీసుకుంది. పెన్నిధి ఏదో దొరికినంత సంబరపడిపోయింది. తన కాళ్లకి వేసుకుని చూసుకుంది. సరిపోయినాయి. ఒక అడుగు ముందుకు వేసి - పిల్లల వంక చూసింది.

వాళ్లు చెమటలు కారుతూ, ఎండకి ముఖాలు వాడిపోయి ఉన్నారు.

తన కాళ్ల నుంచి చెప్పులు తీసింది.

ఏడుపు ముఖంతో నిలబడ్డ పెద్ద కొడుక్కి ఇచ్చింది.

"సు వ్వేసుకో కొడుకా!... ఎండ మాడించేస్తున్నది..." అన్నది.

"ఎక్కడివమ్మా?" తల్లి తనకి చెప్పులు ఇచ్చినందుకు ఆనందపడిపోతూ అడిగాడు.

"పనికాడ అమ్మగారు ఇచ్చిందిరా! ఇంటికి తీసుకువెళ్లితే మీ అయ్య బతకనియ్యడని - ఈడ దాచిన... మన అదృష్టం... ఎవరూ తియ్యలేదు" చెప్పింది సత్తెమ్మ.

సత్తెమ్మ ముందుకి సాగిపోతూనే ఉన్నది.

దొరికిన పెన్నిధి తనకే సొంతమైనందుకు సంబరపడిపోతూ, గెంతుకుంటూ ముందుకు పరుగులు తీస్తున్నాడు సత్తెమ్మ పెద్ద కొడుకు.

"పాపం!... తన కోసం తెచ్చుకున్న చెప్పులు కొడుక్కి ఇచ్చింది!" రామారావు అనుకున్నాడు.

"అమ్మా! నా కాళ్లు కాలడంలేదే -" అంటూ ముందుకు పరుగులు తీస్తున్నాడు వాడు హుషారుగా.

ఆ ఎండలో సత్తెమ్మ నడుస్తూనే ఉన్నది.

సత్తెమ్మ పెద్ద కొడుకు లేడిలా గంతులేసుకుంటూ వెళుతున్నాడు ఆనందంతో -

ఓ ఇరవై గజాలు ముందుకి నడిచిన సత్తెమ్మ ఆగి, ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది.

సత్తెమ్మ చిన్న కొడుకు అక్కడే నిలబడి, మొండిగా ఏడుస్తున్నాడు. క్రింద కాళ్లు మాడుతున్నాయి. పైన నెత్తి మాడుతున్నది. ఒక్క నిముషం నిలబడి చూసింది వాడివంక - వాడిని రమ్మని పిలిచింది. వాడు రానని బుర్ర అడ్డంగా ఊపాడు. ఏడుస్తూ నిలబడ్డాడు.

కిటికీలో నుంచి చూస్తున్న రామారావుకి చిరాకు వేసింది. అసలు ఈ పిల్లలు ఈ ఎండలో ఎందుకు సత్తెమ్మ వెంటపడ్డట్టు? ఎవరో ఇచ్చిన ఒక్క చెప్పుల జత, తనకి మానుకుని - ఒక కొడుక్కి ఇచ్చింది. రెండోవాడు కూడా కావాలని పేచీ పెడతాడో ఏమో - ఎక్కడ నుంచి తెస్తుంది... రామారావు అనుకున్నాడు.

"ఆ అమ్మ ఇచ్చిన చెప్పుల్ని పెద్దోడికి ఇచ్చింది... ఈ చిన్నోడికి తను ఎక్కడి నుంచి తెస్తుంది...? ఏం పిల్లలో! అన్నింటికీ పేచీలే..." విసుక్కుంది.

సత్తెమ్మనీ, ఆమె చిన్న కొడుకునీ చూస్తూ నిలబడ్డ రామారావుకి విసుగొచ్చింది... సత్తెమ్మ చిన్న కొడుకు మీద కోపమూ వచ్చింది... మరుక్షణంలో - జాలీ కలిగింది - చెప్పుల కోసం ఏడిచే సత్తెమ్మ చిన్న కొడుకు మీద, అవి ఇవ్వలేని సత్తెమ్మ అసమర్థత మీద.

సత్తెమ్మ వెనక్కి తిరిగింది. కాళ్లు మాడుతున్నా లెక్క చెయ్యలేదు. గబగబా పరుగులు తీస్తున్నది చిన్న కొడుకు కోసం -

"ఈ ఎండకి వాడు ఎన్ని దెబ్బలు తినాలో!... మొండి వెధవ!..." కిటికీలో నుంచి చూస్తున్న రామారావు నిట్టూర్చాడు.

చిన్న కొడుకు దగ్గరకు వెళ్లింది. వాడు ఏడుస్తూనే ఉన్నాడు.

"రావే...! నా బాబురా!!" అని అమాంతం కొడుకుని దగ్గరకు తీసుకుంది. వాడిని తన భుజం మీద ఎక్కించుకుంది.

"నీకు చెప్పులు లేకపోతే పోనీ - నిన్ను ఎత్తుకున్నా బిడ్డా! అన్నకంటే నువ్వు ఎత్తుగా ఉన్నావే. నీ కాళ్లు కాలవు." కొడుకుతో మాట్లాడుతూ నడుస్తున్నది తన కాళ్లు కాలుతున్నా లెక్కచేయక.

ముందుగా నడుస్తున్న అన్నను చూసి, తల్లి భుజం మీద కూర్చున్న సత్తెమ్మ చిన్న కొడుకు హుషారుగా నవ్వుతున్నాడు.

కిటిలో నుంచి ఈ దృశ్యాన్నంతా చూస్తున్న రామారావు ఆశ్చర్యపోయాడు. ఒకే ఒక్క క్షణం అప్రతిభుడే అయినాడు.

తను చూస్తున్నది, చూసింది వేరు!

జరుగుతున్న సంఘటన గురించి తను ఆలోచించింది వేరు!

తను ఊహించింది వేరు!

తను ఒక మామూలు మనిషిగా మాత్రమే ఆలోచించాడు.

కానీ - జరిగింది మరొకటి -

సత్తెమ్మలోని తల్లి మనసుని - తను ఊహించలేకపోయాడు.

అంత ఎండలో - కొడుకు విసిగిస్తున్న సత్తెమ్మ, ఆవేశంగా వస్తున్న సత్తెమ్మ కొడుకుని కొడుతుందని తనూ ఊహించిన సత్తెమ్మ - వాడిని కొట్టకపోగా, వాడికి తను చెప్పులు ఇవ్వలేనందుకు వాడి కాళ్లు కాలకుండా, వాడి మనసు నొప్పించకుండా - తనకి శక్తి లేకపోయినా - వాడిని తన భుజం మీద ఎక్కించుకుంది.

సత్తెమ్మ ఆవేశంలో ఉన్నది కోపం కాదు - ప్రేమ.

సత్తెమ్మ చిరాకులో ఉన్నది - స్వార్థం తెలియని త్యాగం -

మాతృ హృదయం - ఇవేవీ తన ఊహకి అందలేదు -

సత్తెమ్మ వెళ్లిపోయింది - ఆ సంఘటన అంతటితో - ముగిసిపోయింది.

ఆ దృశ్యాన్ని మొదటి నుంచీ - చివరి వరకూ చూసిన రామారావుకి మాత్రం ఆలోచనలు వదల్లేదు. ఈగల్లా ముసురుకుంటూనే ఉన్నాయి.

సత్తెమ్మ - ఒక మామూలు స్త్రీ - చదువుకోలేదు, డబ్బు లేదు, సమాజంలో విలువ లేదు, హోదా లేదు -

ఉన్నది ఒక్కటే - తల్లి మనసు - మాతృ హృదయం. తనని గురించి కూడా తను ఆలోచించకుండా - నిస్వార్థంగా ఆమె ఇవ్వగలిగింది - ఆమె ప్రేమ ఒక్కటే! ఆ ప్రేమకి విలువ ఎంత? - విలువ ఎక్కడ...!

"తన ఊహకి, వాస్తవానికీ ఎంత తేడా! తన ఆలోచన ఎంత సంకుచితంగా, ఎంత చిన్నగా ఉంది!" ఎందుకో తను చాలా తక్కువగా, చిన్నగా ముడుచుకుపోతున్న భావన కలిగింది రామారావుకి.

"కాఫీ తీసుకోండి." భార్య పిలుపుతో రామారావు ఆలోచనలకి అంతరాయం కలిగింది.

కాఫీ త్రాగడం పూర్తి చేశాడు.

జరిగిన సంఘటన మనసులో మెదులుతూనే ఉన్నది. ఆ సంఘటన తాలూకు భావన, ఆలోచనలూ తనని వేధిస్తూనే ఉన్నాయి.

రామారావులో స్పందన కలిగింది. జరిగిన సంఘటన చూసి, హృదయంలో చలనం కలిగింది - జ్ఞానోదయం అయినట్లు, తన బాధ్యత గుర్తు వచ్చినట్లు అనిపించింది. కనువిప్పు కలిగింది - ఆనందంగానూ అనిపించింది..."

★ ★ ★ ★ ★

**శ్రీరామ్** కథ చదవడం ఆపేశాడు. అప్పటికి ఆ కథని ఓ అరడజను సార్లయినా చదివి ఉంటాడు. అందుకే ఈసారి చదవడం - అసంపూర్తిగానే వదిలేశాడు. ఆలోచనలు ముందుకి సాగినాయి. ఆలోచనల్లో గతం మళ్లీ తొంగిచూసింది. ఈ కథ ప్రచురణ జరిగి కూడా చాలా కాలమే అయింది. ఈ కథ తనని మాత్రం మార్చేసింది.

ఇప్పుడు తనకి తృప్తిగా ఉంది. అమ్మ తన దగ్గరే ఉంది. తన మంచి చెడ్డలు అమ్మవి, అమ్మ మంచి చెడ్డలు తనవి - ఈ తృప్తి చాలు తనకి.

తనలోని ఈ పరివర్తనకి కారణం ఆ కథ, ఆ కథని రచించిన రచయిత - ఆ రచయితకి తను ఎంతో ఋణపడి ఉన్నాడు.

ఆ రచయితని కలవడానికే తన ఈ ప్రయాణం! కష్టపడి అడ్రస్సు సంపాదించాడు. అమ్మతో చెప్పి, రెండు రోజుల్లో వస్తానని హైదరాబాద్ నుంచి విజయవాడ బయలుదేరాడు.

★ ★ ★ ★ ★

## తెల్లవారింది.

విజయవాడ స్టేషన్ సందడిగా ఉంది. బయటికి వచ్చి, రిక్షా ఎక్కాడు. తన స్నేహితుడు మధు విజయవాడలోనే పని చేస్తున్నాడు. అడ్రస్సు చెప్పాడు. రిక్షా సాగిపోయింది.

కాలింగ్ బెల్ నొక్కాడు శ్రీరామ్. తలుపు తెరుచుకుంది.

"అరె... శ్రీరామ్! రారా లోపలికి" ఆనందంగా పలకరించాడు మధు.

లోపలికి వచ్చి కూర్చున్నాడు శ్రీరామ్. పలకరింపులూ, కుశల ప్రశ్నలూ అయినాయి.

ముఖం కడుక్కుని వచ్చి కూర్చున్నారు ఇద్దరూ.

కాఫీ తీసుకువచ్చి ఇద్దరికీ ఇచ్చింది మధు భార్య లత.

ఎక్కువ సస్పెన్స్‌లో పెట్టడం ఇష్టంలేక, తను వచ్చిన సంగతి చెప్పాడు శ్రీరామ్... ఆ కథ రచయిత రామారావుని కలుసుకోవాలని.

"చాలా కాలమైంది కదూ. ఆ కథ పత్రికలో వచ్చి - నేనూ చదివాను. చాలా బాగుంది" అన్నది లత.

"బాగుండడమే కాదు. నన్ను పూర్తిగా మార్చివేసింది లతా!" అని తన సంగతి చెప్పాడు.

"ఇప్పుడు అమ్మ నా దగ్గరే ఉంది. సెంటిమెంట్ అనుకో... మరేమైనా అనుకో... ఆ కథ చదివి, చాలా కదిలిపోయానురా... మధూ! ఒక్కసారి ఆ రచయితని కలుసుకోవాలనిపించింది. చాలా రోజులైంది కదా! నిన్నూ చూడాలనిపించింది. వచ్చేశాను. రాత్రికే తిరిగి ప్రయాణం. మళ్లీ రేపు ఆఫీసు కదా!..." అన్నాడు.


స్నానాలూ, టిఫినూ, కాఫీలూ అయినాయి. మధు, శ్రీరామ్ కలిసి బయలుదేరారు మధు స్కూటర్ మీద.

అడ్రస్సు తెలుసుకోవడం అంత కష్టం కాలేదు. స్కూటరు ఓ ప్రక్కగా ఆపి, గేటు తీసుకుని లోపలికి వెళ్లారు ఇద్దరూ.

కాలింగ్ బెల్ నొక్కాడు శ్రీరామ్.

తలుపు తెరుచుకుంది.

ఓ నడి వయసు దాటి, జుట్టు కొద్దిగా నెరిసి, బహుశ రెండు, మూడేళ్లలో




రిటైరు కాబోయే వయసున్న ఒకాయన తలుపు తోసి గుమ్మంలో నిలబడ్డాడు.

"రామారావుగారు ఉన్నారా?" అడిగాడు శ్రీరామ్.

"నేనే రామారావుని" అన్నారు ఆయన.

"నమస్కారం. మేము మిమ్మల్ని చూడడానికి వచ్చాం" అన్నాడు శ్రీరామ్.

"అలాగా...! రండి లోపలికి" ఆహ్వానించారు ఆయన.

ఇద్దరూ కూర్చున్నారు. ఆయన మరో కుర్చీలో కూర్చున్నారు.

"రచయిత రామారావు అంటే కొంచెం చిన్న వయసు వాడిగా ఊహించుకున్నాడు. ఈయన కాస్త పెద్దవాడే!" అనుకున్నాడు శ్రీరామ్.

ఇల్లు పొందికగానే ఉంది. శుభ్రంగా ఉంది.

"మా స్నేహితుడు శ్రీరామ్ వీడు. మీ కథ చదివి, చాలా మూవ్ అయ్యాడు. ఆ కథ వాడ్ని చాలా ప్రభావితం చేసింది. అంతే! మిమ్మల్ని చూడాలని హైదరాబాద్ నుంచి వచ్చాడు" అని - కథ పేరు చెప్పి, తాము వచ్చిన సంగతి, శ్రీరామ్ గురించి చెప్పారు మధు.

రామారావుగారికి ఆనందం కలిగింది -

"అలాగా! చాలా సంతోషం... ఆ కథ ప్రచురణ జరిగి కూడా చాలా రోజులే అయింది కదా!" అన్నారు.

"అవునండీ! చాలా రోజులే అయింది. అయినా నేను మీ కథని మరిచిపోలేదు. నిజంగా మీ కథ బాగుంది. నా కర్తవ్యాన్ని బాధ్యతని గుర్తు చేసింది. నన్ను చాలా మార్చింది.

"ఒక మంచి రచన, ఒక మంచి సాహిత్యం సమాజం మీద ఎంత మంచి ప్రభావం చూపుతుందో - నాకు అనుభవంలో తెలుస్తున్నది. అందుకు నేనే

ఉదాహరణ!" అన్నాడు శ్రీరామ్.

రామారావుగారి ఆనందానికి అవధు ల్లేవు.

పొంగిపోయారు. తన రచన మూలంగా - ఒక పాఠకుడిని మంచిగా ప్రభావితం చేసినందుకు - ఆయనకి చాలా సంతోషం వేసింది. నిజంగా రచయితగా తనకి అంతకంటే కావలసిందేమీ లేదు...

"ఆ కథ గుర్తు వచ్చినప్పుడల్లా నేనూ కదిలిపోతాను.

"ఆనాటి సంఘటన నన్నూ మార్చింది. నిజానికి మీలోని మార్పుకి, నాలోని మార్పుకీ - నా రచనది కాదు గొప్పతనం! ఒకనాటి సంఘటన! - ఆ సంఘటనకి, నా ఆలోచనలు చేరి - ఒక కథగా మారింది. దానితో బాటూ నన్నూ మార్చి, నా బాధ్యతను గుర్తు చేసింది" అన్నారు. ఆయన మాటలు చాలా నిగర్వంగా ఉన్నాయి.

ఇంతలో తలుపు చప్పుడైంది.

లేచి వెళ్లి తలుపు తీశారు రామారావుగారు.

ఎదురుగా ఓ పాతికేళ్ల యువకుడు నిలబడి ఉన్నాడు.

"రా... సూర్యం!... లోపలికి రా!..." పిలిచారు.

అయిదు నిమిషాలు వాళ్ల ఇద్దరి మధ్యా పలకరింపులూ, మాటలూ దొర్లినాయి.

లోపలి నుంచి రామారావుగారి భార్య కాఫీలు తెచ్చి ఇచ్చింది. కాఫీలు త్రాగడం పూర్తి చేశారు.

"ఎందుకు మాస్టారూ కబురు చేశారట?" అడిగాడు సూర్యం.

రెండు నిమిషాలు మాట్లాడలేదు రామారావుగారు.

"మీ అమ్మకి ఒంట్లో బాగాలేదట. చాలా సీరియస్‌గా ఉందట సూర్యం! మీ ఊరి నుంచి వచ్చిన సుబ్బారాయుడు చెప్పాడు. మీ అమ్మ నిన్ను చూడాలని కలవరిస్తున్నదట - పాపం! ఎలా ఉన్నదో, ఏమో - నా కీ విషయం తెలిసి కూడా పది రోజులైంది. అప్పటి నుంచీ - నీ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఒక్కసారి వెళ్లి చూసిరా సూర్యం!" అన్నారు.

"చాలా బిజీగా ఉన్నాను మాస్టారూ! అయినా - ఏమిటి మాస్టారూ మీరు కూడా చాదస్తంగా! - అస్తమానం - ఆవిడ నన్ను చూడాలనుకుంటే - నాకు ఎలా కుదురుతుంది? నా ఉద్యోగం, హడావిడి - అందులో ఈ మధ్య మరీ బిజీగా ఉంటున్నది.

"అయినా - ఈ పెద్ద వాళ్లకి ఏమీ పని లేదు. చాదస్తం ఎక్కువ. ఉన్నచోట ఉండరు. నోరు మూసుకుని పడి ఉండక - ఏమిటో చూడాలని కోరికలు - ఒంట్లో బాగాలేదని విసిగిస్తారు. చాలా బోర్ మాస్టారూ!" విసుక్కున్నాడు సూర్యం!

రామారావుగారు కొద్దిగా ఆశ్చర్యపోయారు.

"మీ అమ్మ సూర్యం! నిన్ను చాలా కష్టపడి పెంచింది.

"ఈనాడు నువ్వింత మంచి స్థితిలో ఉన్నావంటే - అందుకు మీ అమ్మే కారణం, ఒక్కసారి వెళ్లి చూస్తే బాగుంటుంది" అన్నారు.

"అదేమంత గొప్ప విషయం కనుక? ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లల్ని బాగానే పెంచుతారు. అయినా - మా అన్న దగ్గర ఉంది - ఇంకేం కావాలి? - నాకు ఇప్పుడు వీలుపడదు మాస్టారూ! ఆఫీసులో మీటింగ్ ఉంది. వీలైతే - మరో పది రోజుల తరువాత చూస్తాను" అన్నాడు సూర్యం.

రామారావుగారు ఏమీ మాట్లాడలేదు.

కాసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"మరి నేను వెళ్తాను మాస్టారూ! పని ఉంది" అని లేచాడు.

"అలాగే!" అన్నట్లు తల ఊపారు రామారావుగారు.

"రామారావుగారూ! ఎవరండీ అతడు?" సూర్యం వెళ్లిపోయాక, అడక్కుండా ఉండలేకపోయాడు శ్రీరామ్.

శ్రీరామ్ ప్రశ్నకి చిన్నగా నవ్వారు ఆయన వేదాంతిలా.

"ఒకనాటి సంఘటనకి ప్రత్యక్ష సాక్షి. చాలా ఎదిగిపోయాడు" అన్నారు.

"అంటే?"

"మీరు చదివిన కథలోని సత్తెమ్మ చిన్న కొడుకు" అన్నారు నిదానంగా.

"నిజమా!!" అయోమయంగా అన్నాడు శ్రీరామ్.

"అవును శ్రీరామ్‌గారూ! నిజంగా నిజం. ఆనాటి సంఘటన ఆ సంఘటన గురించి కథ రాసిన రామారావు ఇప్పుడు మీ ముందు ఉన్నది నిజం. అలాగే ఈ సూర్యం కూడా ఆ సత్తెమ్మ కొడుకు అన్నది నిజం!"

శ్రీరామ్ మాట్లాడలేదు.

"అలాగా!" అన్నాడు మధు.

"ఆనాటి ఆ సంఘటన చూసిన ప్రేక్షకుల్ని ఆ సంఘటనని కథగా రాసిన నేను మారాను. ఆ కథ చదివిన మీలోనూ మార్పు వచ్చింది - రచయితగా నాలోనూ, పాఠకుడిగా మీలోనూ మంచి మార్పు వచ్చింది.

"ఎటొచ్చీ - కథలోని పాత్రకే మార్పు రాలేదు.

"ఆ పాత్రకి హృదయం లేదు. ఉన్న హృదయం బహుశా రాయిలా మారింది.

"నా కథ చదివి, మీలో స్పందన కలిగి, మిమ్మల్ని మంచిగా మార్చిన నా రచన గురించి నాకు ఆనందంగానూ ఉంది.

"అందులోని పాత్రే సజీవంగా నా ముందు నిలబడి, మూర్ఖంగా ప్రవర్తించినందుకు బాధగానూ ఉంది." బాధపడ్డారు రామారావుగారు.

శ్రీరామ్‌కి, మధుకి అక్కడ కాలం కదులుతున్నట్టుగా అనిపించలేదు - శ్రీరామ్ మనసులో - ఏదో అసంతృప్తి - చూసిన నిజం జీర్ణించుకోలేని అశక్తత అతన్ని ఆవరించింది.

"మరి మేం వెళ్లి వస్తాం, రామారావుగారూ! మీ కలం నుంచి ఇంకా మంచి రచనలు రావాలని ఆశిస్తున్నాం..." అని చెప్పి, బయలుదేరారు ఇద్దరూ!...

★ ★ ★ ★ ★

**ఆ రాత్రి** తిరుగు ప్రయాణంలో - రైల్లో కూర్చున్న శ్రీరామ్‌కి - "తన ఈ ప్రయాణం తనకి ఏం మిగిల్చింది...? కొన్ని కొన్ని నిజాలు తెలియకపోతేనే బాగుంటుందేమో - ఈ చేదు నిజాన్ని తను జీర్ణించుకోలేకుండా ఉన్నాడు..." అనిపించింది.

రైలు గమ్యం వైపు సాగిపోతూనే ఉన్నది. ●

వచ్చేవారం ప్రత్యేక ఎంపిక కథ

స్వామి రచన

**'ఇరుసు'**

